వైద్య కళాశాలల ప్రైవేటీకరణను సహించేది లేదు

- మాజీ మంత్రి విడదల రజిని
- కూటమి ప్రభుత్వానికి పేదల వైద్యం, వైద్య విద్యపై చిత్తశుద్ధి లేదు

చిలకలూరిపేట: పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు ఉద్దేశించిన వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని జాకీర్‌హుస్సేన్ వీధిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా పదోవార్డు పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అందులో 7 కాలేజీలు జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే దాదాపు పూర్తి చేయడం జరిగిందని, 2023–24లోనే 5 కాలేజీలలో క్లాసులు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పేదల ఆరోగ్యం పట్ల, పేద విద్యార్థుల ఉన్నత చదువుల పట్ల ఉన్న చిన్నచూపు కానవస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ తమ పార్టీ కోటి సంతకాల ఉద్యమం చేపట్టిందని వివరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రజలచే సంతకాలు పెట్టించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు ఏకాంబరపు సునీత, వార్డు ఇన్‌చార్జి సయ్యద్ జమీర్, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ యూసుఫ్ అలి, షేక్ మీరాబి, నాయకులు షేక్ అహమ్మద్, షేక్ జాని, షేక్ సలీమా, పటేల్, జాన్, అంజలి, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్య, వైద్యం ప్రజలకు దూరం

నాదెండ్ల: కూటమి ప్రభుత్వంలో విద్య, వైద్యం ప్రజలకు దూరమయ్యాయని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల అంబేడ్కర్ కాలనీలో బుధవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయటాన్ని నిరశిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో పర్యటించి గ్రామస్తుల నుంచి సంతకాలు సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదవాడికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు బాగా చదువుకోవటం ఇష్టం లేదని, అందుకే ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు పీపీపీ విధానాన్ని తెరపైకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, పార్టీ ప్రధాన కార్యదర్శి వలేటి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, మండల అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, జిల్లా అధికార ప్రతినిధి ఉడతా వెంకటేశ్వరరావు, బీసీ విభాగం అధ్యక్షుడు గుంజి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు సింగారెడ్డి కోటిరెడ్డి, మాజీ ఎక్స్‌అఫీషియో మెంబర్ మోషే, యువజన విభాగం అధ్యక్షుడు చందు, ఉపాధ్యక్షుడు అల్లడి రవికుమార్, ఎంపీటీసీలు ఏసమ్మ, ఎల్లారావు, అంకమ్మ, నాయకులు రామకృష్ణ, నాగయ్య, శివకామేశ్వరరావు, కృష్ణారావు, శేషయ్య, చెంచురాజు, చిన కోటయ్య, జానీబాషా, మల్లి, న్యాయవాది బహుజంకు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని



ప్రజలతో సంతకాలు చేయిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

ప్రజల మద్దతుతోనే కూటమి సర్కారుకు గుణపాఠం

యడ్లపాడు: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమమే రచ్చబండ కార్యక్రమమని మాజీ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు రజినికి ఘన స్వాగతం పలికారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ పల్నాటి గురవయ్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. తొలుత పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రామాలయం వద్ద రచ్చబండ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి స్థానిక సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన 17 మెడికల్ కళాశాలల్లో కొన్ని నిర్మాణం పూర్తి చేసుకోగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అలాగే సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి నిర్మాణాల ద్వారా పేద, మధ్య తరగతికి నాణ్యమైన వైద్య సేవలు అందించేలా జగన్‌మోహన్ రెడ్డి కృషి చేశారన్నారు. అటువంటి వైద్య కళాశాలలను ముఖ్యమంత్రి చంద్రబాబు తమ అనుయాయులకు కట్టబెట్టేందుకే పీపీపీ విధానం అమల్లోకి తెస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణల ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి మాట్లాడుతూ వైద్య కళాశాలల రూపేణా మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ.లక్ష కోట్ల ప్రభుత్వ సంపద సృష్టిస్తే.. కూటమి ప్రభుత్వం వారి పార్టీ శ్రేణులకు పీపీపీ పేరుతో పప్పుబెల్లాల్లా కట్టిబెట్టేందుకు యత్నించడం దారుణమన్నారు. ఇదే వేదికపై గ్రామ పార్టీ నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. వీరిలో కమిటీ అధ్యక్షుడిగా తాతినబోయిన కోటయ్య, ప్రధాన కార్యదర్శి పోతురాజు అంజియ్య, యూత్ అధ్యక్షుడిగా పల్నాటి రాజు తదితరులు ఉన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ ప్రక్రియ చేపట్టారు. పార్టీ సీనియర్ నాయకులు మానం సాంబయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వడ్డేపల్లి నరసింహారావు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రాచమంటి చింతారావు, మాజీ ఎంపీపీ ఎంవీ బాలచంద్రారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి పందుల బుల్లెబ్బాయి, నాయకులు శివరామకృష్ణ, జాకీర్ హుస్సేన్, రెహమాన్‌ఖాన్, మాధవరావు, తిరుపతయ్య, లక్ష్మీనారాయణ, పెదబాబు, వెంకట లక్ష్మీనారాయణ, వెంకట్రావు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీమంత్రి విడదల రజిని

క్లుప్తంగా

స్కూల్ గేమ్స్‌లో పసుమర్రు విద్యార్థుల ప్రతిభ



చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల రాజమండ్రిలో రాష్ట్ర స్థాయి ఉషు మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని పసుమర్రు మద్ది కామయ్య జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి హమీద్ బాషా అండర్–17 విభాగంలో రజత పతకం సాధించాడు. అలాగే డివిజన్ స్థాయిలో నరసరావుపేటలో నిర్వహించిన అండర్–17 బ్యాడ్మింటన్ పోటీలలో పాఠశాలకు చెందిన కోటా కవిత, షేక్ పర్వీన్, అట్లూరి శైలజ విశేష ప్రతిభ చూపి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను అభినందించిన వారిలో స్కూల్ హెచ్‌ఎం వై.హనుమంతరావు, 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు గద్దే హరిబాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ కోటా సుదర్శన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కళాకారుల సమావేశం

వినుకొండ: గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో నియోజకవర్గ కళాకారుల సమావేశం స్థానిక జాషువా కళాప్రాంగణంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కళాపీఠం వ్యవస్థాపకులు గుమ్మడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాకారులందరూ ఐక్యంగా ఉండి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడంలో ముందుండాలని కోరారు. కళాకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కళాకారులు 50 మంది పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించిన ఆర్డీవో



వినుకొండ: ఈపూరు మండలం ఇనిమెళ్ల గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని ఆర్డీవో మధులత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇంత జరుగుతున్నా ఎందుకు అడ్డుకోలేకపోయారని స్థానిక అధికారులను ప్రశ్నించారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ నళినికి సూచించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బొలెరో వాహనం



చిలకలూరిపేటటౌన్: ఆర్టీసీ బస్సును బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... చిలకలూరిపేట డిపో నుంచి ప్రయాణికులతో వస్తున్న విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును గుంటూరు నుంచి ఒంగోలు వెళ్తున్న బొలెరో ట్రక్కు వాహనం ఢీకొంది. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో బస్సు కిందకు దూసుకువెళ్లడంతో బొలెరో వాహనం ముందుభాగం, ఆర్టీసీ బస్సు మధ్యలో ఢీ కొనడంతో బస్సుతో పాటు ట్యాంక్ ధ్వంసమైంది. డీజిల్ భారీగా నేలపాలైంది. అయితే ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించి, వాహనాలను పక్కకు తీయించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురపాలక పరిధిలో 100 తాత్కాలిక షాపుల ఏర్పాటు



నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలో స్వయం సహాయ సంఘాల (డ్వాక్రా) సభ్యులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు 100 తాత్కాలిక షాపులు ఏర్పాటు చేయనున్నారు. ఇవి ఐరన్ కంటెయినర్ మాడ్యులర్ యూనిట్లతో 3 అడుగుల వెడల్పు, 50 అడుగుల లోతుతో ఉంటాయి. వీటిని పట్టణంలోని రోడ్ల మార్జిన్లలో ఏర్పాటు చేసి ఎంపిక చేసిన గ్రూపు సభ్యులకు కేటాయిస్తారు. మెప్మా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ అమలుకు జిల్లా కేంద్రం నరసరావుపేటలో కావాల్సిన పాయింట్ల గుర్తింపుకు మెప్మా పీడీ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మున్సిపల్ అధికారులు పర్యటించారని మున్సిపల్ డీఈ మహమద్ రఫీక్ వెల్లడించారు. మొత్తం 6 పాయింట్లను గుర్తించటం జరిగిందన్నారు. ఇప్పటికే ఇటువంటి షాపులను నెల్లూరు పట్టణంలో ఏర్పాటు చేశారని, త్వరలో అన్ని ప్రాంతాల్లో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

వినుకొండ: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబరు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ నాయకులతో కలిసి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బొల్లా మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశాన్ని ప్రపంచానికి తెలిసేవిధంగా కృషి చేసిన ఘనత అబ్దుల్ కలాంకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అంజిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎస్.ప్రసాద్, పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి పగడాల వెంకటరామిరెడ్డి, పార్టీ నాయకులు కొత్త కృష్ణారెడ్డి, దండు చెన్నయ్య, రొడ్డా పుల్లారెడ్డి, నాగిరెడ్డి, మహిళా నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో బుధవారం జన విజ్ఞాన వేదిక, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం జరిగింది. చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్షుడు తేళ్ళ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాసిన ఎస్‌ఎంఎంఎస్ పుస్తకాలను ఆవిష్కరించారు. జేవీవీ అధ్యక్షుడు ధూళిపాళ వెంకట్రావు, కార్యదర్శి బొంత అజయ్ బాబు, డాక్టర్ పీవీ సుబ్బారావు, లాలూదాదా సాహెబ్ సేవాసమితి అధ్యక్షుడు కరిముల్లా , డాక్టర్ దార్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో బుధవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి శాస్త్ర సాంకేతిక రంగంలో అపార మేధస్సు గల కలాం మిస్సైల్ మేన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందారని కొనియాడారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా

అబ్దుల్ కలాంకు నివాళులర్పించిన డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: తన చదువు, మేధస్సు ఈ దేశానికి, పేదలకు ఉపయోగపడాలని భావించిన గొప్ప ఆదర్శనీయుడు దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం అని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పల్నాడు రోడ్డులోని కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఎటువంటి రాజకీయ, ఆర్థిక అండదండలు లేకుండా ఒక పేద కుటుంబంలో జన్మించి, ఉన్నత చదువులు చదివి భారత రాష్ట్రపతిగా, దేశం గర్వించదగ్గ క్షిపణి శాస్త్రవేత్తగా నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాష్టారు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పాలపర్తి వెంకటేశ్వరరావు, ఎన్‌కే ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మైనార్టీ విభాగ జిల్లా కార్యదర్శి సయ్యద్‌ఖాదర్ బాషా, పట్టణ మైనార్టీ విభాగ అధ్యక్షుడు షేక్ శిలార్‌బాషా, మాజీ కౌన్సిలర్ బత్తుల లక్ష్మీపద్మలత, నాయకులు పాదిలే ఖాజా, షేక్ ఖాదర్ బాషా, కోట చిన్నబాబు, కంచర్ల హనుమంతరావు, బాదుగున్నల శ్రీనివాసరావు, సుబ్రమణ్యంనాయీ, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

అసత్య ఆరోపణలపై వైఎస్సార్‌సీపీ మహిళల ఆగ్రహం

వినుకొండ: మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాటలను వక్రీకరించి అసత్య ఆరోపణలు చేయడంపై వైఎస్సార్‌సీపీ మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బొల్లా బ్రహ్మనాయుడుకు మద్దతుగా బుధవారం వైఎస్సార్‌సీపీ మహిళలు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న కల్తీ మద్యం వ్యాపారాన్ని అరికట్టాలని ఎక్సైజ్ అధికారులకు రెండు రోజుల క్రితం వినతిపత్రం అందజేసి మీడియాతో మాట్లాడుతూ కల్తీ మద్యం తాగి పేద ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారని, వారి కుటుంబసభ్యులు రోడ్డున పడుతున్నారని, ఆడవారు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారని, ఆ మాటలను వక్రీకరించి ఆయనపై కూటమి నేతలు చేస్తున్న అసత్య ఆరోపణలను వైఎస్సార్‌సీపీ మహిళ విభాగం తీవ్రంగా ఖండించింది. నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న నాయకుడు బ్రహ్మనాయుడును ఇలా కించపరిచి అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని వారు అన్నారు. కార్యక్రమంలో మహిళ నాయకులు చిన్నమ్మాయి, దుర్గ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



బొల్లా బ్రహ్మనాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

పశువులకు ఉచిత వైద్య శిబిరం

యడ్లపాడు: పశువుల ఆరోగ్య పరిరక్షణతోనే రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని పల్నాడు జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ పి.రామారావు తెలిపారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ, గుంటూరు జిల్లా పశు గణాభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పశుగణాభివృద్ధి సంఘం జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ వై.సుధాకర్, విజయవాడ పశుసంవర్ధక శాఖ కార్యాలయం సంయుక్త సంచాలకులు డాక్టర్ టీవీ సుధాకర్, యడ్లపాడు ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వై.రాధాకృష్ణ పాల్గొన్నారు. పాడి రైతులకు లింగ నిర్ధారిత వీర్యం ప్రాధాన్యత, లేగ దూడల పోషణ, అధిక పాల ఉత్పత్తికి పాటించాల్సిన మెళకువలను వివరించారు. 39 గేదెలకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. 56 దూడలకు డి–వార్మింగ్ మందులను పంపిణీ చేశారు. 36 జనరల్ కేసులు, 50 పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. పశు వైద్యులు డాక్టర్ కబ్బిరెడ్డి మల్లేరాజు రైతు గొర్రెకు అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా చేసి ప్రశంసలు అందుకున్నారు. సొలస, తిమ్మాపురం, జగ్గాపురం పశు వైద్యులు డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ షేక్ కలిషాబేగం, గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, బోడ శ్రీనివాసరావు, జేవీవో, ఏహెచ్‌ఏ, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతోనే భూమి ఆరోగ్యం

రొంపిచర్ల: భూమి ఆరోగ్యంగా, సారవంతంగా ఉండాలంటే జీవన ఎరువుల వినియోగం ఒక్కటే మార్గమని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి అరుణ అన్నారు. మండలంలోని తుంగపాడులో భూమి ఆరోగ్యం, భూసారంపై బుధవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతుల ద్వారా భూమి ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో రైతులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. జీవన ఎరువులను తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా తెలియజేశారు. జీవన ఎరువు తయారీకి 95 కిలోల పొడిపొడిగా ఉన్న పేడ, 2 కేజీల ట్రైకోడెర్మావిరిడి, 2 కేజీలు సుడోమోనాస్, ఒక కేజీ వీఏఎంను తీసుకోవాలన్నారు. ఈ మిశ్రమంతో 100 కేజీల జీవన ఎరువు తయారు చేయవచ్చన్నారు. భూసార పరీక్షల ఆధారంగా సాగు చేస్తున్న పంటలకు ఎరువులను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో శివలలిత, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయినాథ్, పలువురు రైతులు పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

పురపాలక సంఘానికి రూ.2.7 కోట్ల నిధులు

నరసరావుపేట: పురపాలక సంఘానికి బీపీఎస్–ఎల్‌ఆర్‌ఎస్ నిధులు రూ.2.7 కోట్లు గ్రాంట్ లభించిందని మున్సిపల్ డీఈ షేక్ మహమద్ రఫీక్ బుధవారం వెల్లడించారు. పట్టణంలో రోడ్లు, డ్రెయిన్లు, వీధిలైట్లు, కల్వర్టుల నిర్మాణం, పార్కుల అభివృద్ధికి ఈ నిధులు వినియోగించటం జరుగుతుందన్నారు. పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవనున్నామని పేర్కొన్నారు. కాగా, పురపాలక సంఘానికి ఎన్నికలు నిర్వహించకపోవటంతో సుమారు రూ.9.5 కోట్ల 15వ ఫైనాన్స్ నిధులు కోల్పోయిన సందర్భంలో ఈ నిధులు ఆశనిపాతంలా తగిలాయి. గత ప్రభుత్వంలో 34 వార్డుల పరిధిని 38 వార్డులకు పెంచుతూ పట్టణానికి చుట్టుపక్కల ఉన్న పంచాయతీలను విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దీనిపై కొందరు టీడీపీ నాయకులు హైకోర్టును ఆశ్రయించటంతో నరసరావుపేట పురపాలక సంఘం ఎన్నికలకు దూరం కావటంతో నిధులు దూరమయ్యాయి.

నలుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు

రొంపిచర్ల: సుంకం చెల్లించని మద్యంకు సంబంధించిన కేసుల్లో మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన నలుగురి వ్యక్తులను ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ అధికారులు తహసీల్దార్ బి.నిర్మల ఎదుట బుధవారం బైండోవర్ చేశారు. ఈ బైండోవర్ కేసుల్లో మండలంలోని ముత్తనపల్లి, అలవాల, బుచ్చిబాపన్నపాలెం, తుంగపాడు గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. అలాగే ఈపూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాటుసారా, అక్రమ మద్యం, మాదకద్రవ్యాలపై తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని పోతవరం గ్రామ పొలాల్లో పేకాట (కోత ముక్క) ఆడుతున్న స్థావరంపై రూరల్ పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుగున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5100, నాలుగు బైక్‌లను స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్ శ్రీకాంత్ తెలిపారు.

3.2 ఎం.ఎం వర్షపాతం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో బుధవారం ఉదయానికి 3.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. అయితే పగటి పూట చల్లని పొడి వాతావరణం నెలకొంది. మాగాణి పొలాల్లో వ్యవసాయ పనులు నిర్వహించుకునేందుకు ఎలాంటి ఆటంకం కలుగలేదు.

ఉపాధి హామీ శ్రామికులకు ఈ–కేవైసీ తప్పనిసరి

డ్వామా ఏపీడీ హీరాలాల్



రొంపిచర్ల: మండలంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ జాబ్ కార్డు గల శ్రామికులకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ–కేవైసీ చేయించుకోవాలని డ్వామా ఏపీడీ హీరాలాల్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాబోయే సీజన్ నుంచి ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే శ్రామికులందరికీ ఈ–కేవైసీ తప్పనిసరి అన్నారు. మండలంలో ఇప్పటికే 47 శాతం మంది శ్రామికులకు ఈ–కేవైసీ పూర్తి అయ్యిందన్నారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లో శ్రామికులకు సమాచారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి శ్రామికునికి ఈ–కేవైసీ చేయాల్సిన బాధ్యత ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిపై ఉందన్నారు. ఈ–కేవైసీ లేని శ్రామికునికి ఉపాధి హామీ పనిలో పాల్గొనే అవకాశం ఉండదన్నారు. గ్రామంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు, ప్రతి శ్రామికునికి సమాచారం ఇవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



జానీ(ఫైల్)

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోయపాలెం మసీదు వెనుక వీధిలో నివాసం ఉండే వెల్డర్ షేక్ జానీకి 22 ఏళ్ల కిందట రేష్మతో వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 7వ తేదీ వెనిగండ్ల గ్రామంలో ఓ శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై జానీ దంపతులు వెళ్లి వస్తుండగా, గుంటూరు సమీపంలోని ఏటుకూరు రోడ్డు బైపాస్ వద్ద రాత్రి సుమారు 9 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో వారికి గాయాలయ్యాయి. తలకు తీవ్ర గాయాలైన జానీని గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి జానీ(45) మృతి చెందాడు. బుధవారం పోస్టుమార్టం అనంతరం జానీ మృతదేహాన్ని బోయపాలెం తీసుకు రావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సాయంత్రం స్థానికంగానే అంత్యక్రియలు నిర్వహించారు.

పరిపాలనాధికారిగా పద్మజ రాణి

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ నూతన పరిపాలన అధికారిగా పద్మజ రాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె వట్టిచెరుకూరు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకురాలిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అదృశ్యమైన వివాహిత మృతదేహం లభ్యం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన వివాహిత కర్రి పార్వతి మృతదేహం బుధవారం లభ్యమయినట్లు ఏఎస్సై బాజీ బుధ వారం తెలిపారు. ఏఎస్సై బాజీ తెలిపిన వివరాలు మేరకు బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వైదన అద్దంకి బ్రాంచ్ కెనాల్ లాకుల వద్ద వివాహిత మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. ప్రమాదవశాత్తూ కాల్వలో పడినట్లు.. నీటి ప్రవాహానికి మృతదేహం గల్లంతు అయిందని తెలిపారు. బల్లికురవ మండలం ఎస్సై వై.నాగరాజు ఘటన స్థలాన్ని పరిశీలించి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో శవ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఆయన తెలియజేశారు.

క్లాప్ మిత్రలకు పరిసరాల పరిశుభ్రతపై శిక్షణ

శావల్యాపురం: గ్రామ పంచాయతీల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా క్లాప్ మిత్రలు తమ వంతు కృషి చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో క్లాప్ మిత్రలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ గ్రామాల్లోని క్లాప్ మిత్రలు పచ్చదనం పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించి పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ప్రతి క్లాప్ మిత్ర యూనిఫామ్ ధరించి చేతులకు గ్లౌజులు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారులు పద్మజా రాణి, రిసోర్సు పర్సన్ అరుణ భారతి, స్వచ్ఛత మండల కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.